క్లుప్తంగా

నేడు పెన్షనర్స్ సంఘ సమావేశం

రేపల్లె: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రేపల్లె శాఖ సాధన సమావేశం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు పట్టణంలోని ఏపీటీఎఫ్ జోనల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జనరల్ సెక్రటరీ మునిపల్లి చిన్న రాజారత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంఘ సభ్యులు అందరూ హాజరు కావాలని కోరారు.

22న చమత్కార సాహిత్య ప్రసంగం

రేపల్లె: మాసం మాసం మానసికోల్లాసం సాహితీ సాంస్కృతిక సంస్థ ప్రథమ వార్షికోత్సవం పట్టణంలోని రామశాస్త్రి కల్యాణ మండపంలో ఈ నెల 22వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించబడునని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి అన్నయ్యశాస్త్రి, అగ్నిహోత్రం పవన్‌కుమార్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీవేత్తలను, కళాకారులను ప్రోత్సహించే తమ సంస్థ వార్షికోత్సవంలో చమత్కార సాహిత్య ప్రసంగం కార్యక్రమం నిర్వహించబడునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొనాలని కోరారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గణేష్ టీమ్ ప్రతిభ



రేపల్లె: రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ టీమ్ క్రీడాకారులు ప్రతిభ చాటారు. గత పది రోజుల నుంచి కొల్లూరు మండలం అనంతవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొన్న రాజోలు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని డాక్టర్ గణేష్ టీమ్ క్రీడాకారులు రన్నర్‌గా నిలిచారు. ఇటీవల కృష్ణా జిల్లా ఘంటశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి, దూళిపూడిలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని టీమ్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆదివారం డాక్టర్ గణేష్‌తో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

19న షాపులకు వేలం



చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో వేంచేసియున్న లింగోద్భవస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షాపులను అద్దెకు ఇచ్చేందుకు ఈ నెల 19వ తేదీన వేలం నిర్వహిస్తామని ఆలయ ఈవో నరసింహమూర్తి ఆదివారం తెలిపారు. స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉన్న మొత్తం 8 షాపులకు వేలం నిర్వహిస్తామని ఈవో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.5 వేలు చెల్లించాలని తెలియజేశారు. షాపులు పాడుకున్న వారు ఒక సంవత్సరం అద్దె ముందుగా చెల్లించి షాపులలో వ్యాపారాలు నిర్వహించుకోవచ్చని ఈవో తెలిపారు.

మోహనరావు కుటుంబానికి ఆర్థికసాయం

తెనాలిటౌన్: ఇటీవల మృతి చెందిన కళాకారుడు, సీపీఐ నాయకుడు గాలిముట్టి మోహనరావు సేవలు చిరస్మరణీయమని కళల కాణాచి సంస్థ కోశాధికారి దేవరపల్లి భవానీ పేర్కొన్నారు. ఆదివారం మోహనరావు సంస్మరణ కార్యక్రమాన్ని స్థానిక చంద్రబాబునాయుడు కాలనీలోని ఆయన నివాసం వద్ద నిర్వహించారు. కళల కాణాచి అధ్యక్షుడు బుర్రా సాయిమాధవ్ ఆదేశాల మేరకు సంస్థ కోశాధికారి దేవరపల్లి భవానీ మోహనరావు కుటుంబానికి రూ.5వేల నగదు ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో సమత జ్యోతి, సంగీత కళాసేవా సమితి, ఆర్‌అండ్‌బీ రాజు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

తెనాలిరూరల్: విజయవాడ – తెనాలి రైలు మార్గంలో కొలకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని పురుష మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఆదివారం కనుగొన్నారు. మృతుని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఆనవాళ్లు గుర్తించేందుకు వీలు లేకుండా మృతదేహం ఛిద్రమైందని, సమాచారం తెలిసినవారు తెనాలి జీఆర్పీ పోలీసులను సంప్రదించాల్సిందిగా ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు

తెనాలిటౌన్: స్థానిక ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థన కొండ చర్చిలో ఆదివారం ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించారు. దైవజనులు బ్రదర్ ఆనందన్న కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దైవ సేవకురాలు పి.రత్నకుమారి, బ్రదర్ కె.పాల్ రాజశేఖర్, ప్రశాంత్‌బాబు, సీమోను, పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నీటి సమస్య తీరేనా..?!

బాపట్ల వేసవి నీటి ఎద్దడికి లభించని శాశ్వత పరిష్కారం

- ఊసేలేని రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు
- ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు బ్రేక్
- వేసవిలో రెండు, మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా
- బోరు నీళ్లతోనే సరిపెట్టుకుంటున్న పలు కాలనీలు

బాపట్ల: జిల్లా కేంద్రమైన బాపట్ల పట్టణంలో మంచి నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకుతోనే కాలం నెట్టుకొస్తున్నారు. రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేస్తేనే బాపట్ల పట్టణ ప్రజల నీటి ఎద్దడి సమస్యకు శాశ్వత పరాష్కారం లభిస్తుంది. కానీన ఆ దిశగా ప్రతిపాదనలు ఇప్పట్లో కనిపించటం లేదు. గత ప్రభుత్వం రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణంతోపాటు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు తీసుకుని వాటికి అనుమతులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టింది. కార్యాచరణ చేపట్టేందుకు ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మంచి నీటి సరఫరాపై దృష్టి పెట్టలేదు. దీంతో రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ప్రతిపాదనలకే పరిమితమయింది. రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేసి నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మున్సిపల్ కార్యాలయం

రెండు, మూడు రోజులకు ఒకసారి సరఫరా

బాపట్ల పట్టణంలో ప్రస్తుతం 50 ఎకరాల విస్తీర్ణంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఉంది. కృష్ణానది నుంచి వచ్చే నీటిని ఈ సమ్మర్ స్టోరేజీ ట్యాంకుతో నింపుతారు. అయితే రెండు సార్లు ఈ ట్యాంకును నింపి పట్టణానికి నీటి సరఫరా చేస్తున్నారు. వేసవిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటే రెండు, మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేసి కాలం నెట్టుకొస్తున్నారు.

ట్యాంకు పనులకు వెనుకంజ

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉప్పరపాలెం ట్యాంకు పనులకు వెనుకంజ వేస్తుంది. ఈ ట్యాంకుతో పాటు అదనంగా ప్యాడిసన్‌పేట, బేతనకాలనీ, డ్రైవర్స్ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించేందుకు ప్రతిపాదించారు. వీటికి అనుమతులు వస్తేనే మంచినీరు సజావుగా సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది. గతంలో కేవలం 30 వేల మంది జనాభాకు డిజైన్ చేసిన ట్యాంకుతోనే నేడు 1.08 లక్షల మంది ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నారు. అప్పట్లో కేవలం 4 వేలకు పైగా ఉన్న కుళాయి కనెక్షన్‌లు ఇప్పుడు 12,700కు పెరిగిపోవటంతో విడుదల చేస్తున్న నీరు కూడా సజావుగా సరిపోని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రతిపాదనలో ఉన్న మంచినీటి ట్యాంకు, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు

బాపట్లలో నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి ప్రస్తుతం ఉన్న ట్యాంకు పక్కనే 100.80 ఎకరాలు భూ సేకరణ చేసే పనులకు శ్రీకారం చుట్టాలని ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు ట్యాంకులు ఒక చోటే ఉండటం వలన ప్రత్యేకంగా ట్యాంకును నింపేందుకు అవసరమైన కాలువలు తవ్వే పనిలేకుండా ఉంటుందని, ఖర్చులు కూడా తగ్గించవచ్చని ప్రతిపాదించారు. వీటితో పాటు పట్టణంలో ప్రస్తుతం ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండగా వాటిలో ఉప్పరపాలెం ట్యాంకు పనులు కూడా పూర్తి చేసుకునేందుకు ప్రతిపాదించారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకు

బోరు నీళ్లే ఇస్తున్నారు



ఎన్నో ఏళ్లుగా బోరు నీళ్లే ఇస్తున్నారు. దేవుడిమాన్యానికి మున్సిపాల్టీ నీళ్లు ఇవ్వమని ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేదు. గులాం హుస్సేన్ తోట నుంచి బోరు నీళ్లు మాత్రమే ఇస్తున్నారు. ఆ నీళ్లకు కూడా పైపులైన్లు సరిగా లేకపోవటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం.

–పి.గోపి, దేవుడిమాన్యం

కలుషిత నీటి సరఫరా



బాపట్ల పట్టణంలో నీటి సరఫరా సక్రమంగా జరగటం లేదు. కలుషితమైన నీటి సరఫరా జరుగుతుంది. లీకులు నివారించటంలో జాప్యం కనిపిస్తుంది. మంచినీటి పైపులైన్లలో నీరు సక్రమంగా వచ్చే విధంగా చూడాలి. కలుషితమైన నీటి వలన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది.

– షేక్ ఇసూ, కుమ్మరిపాలెం

వయో వృద్ధులపై వేధింపులు సరికాదు

సీనియర్ న్యాయవాది నాగమోహిని



బాపట్ల: వయో వృద్ధులపై వేధింపులకు దిగితే కఠిన చర్యలు ఉంటాయని సీనియర్ న్యాయవాది జి.ఎస్.నాగమోహిని పేర్కొన్నారు. వృద్ధులపై వేధింపుల నివారణకు స్థానిక పెన్షనర్స్ హోమ్‌లో మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో వృద్ధులపై వేధింపులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. మెయింటెనెన్స్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ చట్టం పట్ల అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాది దగ్గుమల్లి కిరణ్‌కుమార్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెరుకూరు సుబ్బారావు, కనపర్తి రాజారావు, పారా లీగల్ వలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన స్వామివార్ల పల్లకీ సేవ



తెనాలిటౌన్: శ్రవణానక్షత్రం సందర్భంగా శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో శ్రీ స్వామి అమ్మవార్లకు పల్లకి సేవ కనులపండువగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ మాట్లాడుతూ ప్రతి నెల శ్రవణానక్షత్రం రోజున సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ జరుగుతుందని తెలిపారు. అర్చకులు హారతి ఇచ్చి పల్లకీ సేవను ప్రారంభించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

చిరుద్యోగుల పొట్ట కొట్టడం హేయమైన చర్య

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరు గణేష్

చెరుకుపల్లి: దేశ రాజకీయ చరిత్రలో పేద, మధ్య తరగతి నిరుద్యోగుల పొట్ట కొట్టి పైశాచిక ఆనందం పొందుతున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గుళ్ళపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కూటమి ప్రభుత్వం తొలగించిన ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన సంవత్సర కాలంలో ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు, దాడులు చేయడం పైనే దృష్టి సారించిందని ఇది రాజకీయాల్లో సరైన సంప్రదాయం కాదని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించకపోగా ఉన్న ఉపాధిని కక్షగట్టి ఏదో ఒక కుంటి సాకుతో తొలగించారన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎండీయూ ఆపరేటర్‌లు, వలంటీర్లు ఇంకా అనేక మంది చిరు కాంట్రాక్ట్ ఉద్యోగులను వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే సాకుతో అన్యాయంగా తొలగించి వారికి జీవనోపాధి లేకుండా చేశారని, ఈ పాపం ఊరికే పోదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గడిచిన ఐదు సంవత్సరాలలో ఏ ఒక్క ఫీల్డ్ అసిస్టెంటును తొలగించిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గంలో 60 నుంచి 70 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను అన్యాయంగా కూటమి ప్రభుత్వం తొలగించిందని, మరి కొందరిని భయపెట్టి రాజీనామాలు చేయించారని డాక్టర్ గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లు భయపడాల్సిన అవసరం లేదని న్యాయస్థానం ద్వారా పోరాటం చేసి తమ ఉద్యోగాలను సాధించుకోవాలని.. అందుకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. త్వరలోనే రేపల్లె నియోజకవర్గంలో అన్యాయంగా తొలగించిన ఉద్యోగుల జాబితాను సేకరించి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తీసివేసిన ఉద్యోగాలు తిరిగి పొందేందుకు కూటమి ప్రభుత్వంపై న్యాయ పోరాటం చేద్దాం అని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చెరుకుపల్లి, నగరం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు దుండి వెంకటరామిరెడ్డి, ఐ.రామకృష్ణ, నిజాంపట్నం కోటేశ్వరరావు, న్యాయవాదులు చందవోలు కోటేశ్వరరావు, నాగలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శ్రీసరస్వతీ శిశుమందిర్ ప్రబంధకారిణి బాధ్యతల స్వీకారం



తెనాలి: స్థానిక సుల్తానాబాద్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో పాఠశాల ప్రబంధకారిణి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఆదివారం గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం సమక్షంలో నిర్వహించారు. సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహించగా కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ డీఎల్ కాంతారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరిస్తున్న కమిటీ అధ్యక్షుడు అవ్వారు లత, కార్యదర్శి యర్రంశెట్టి హనుమంత రావు, కోశాధికారి కొత్త కిరణ్మయి, సభ్యులు గద్దం శ్రీధర్, దేవతి భాస్కర్‌లను లక్ష్మణబాబు పరిచయం చేశారు. అనంతరం పాఠశాల స్థాపనకు ముఖ్య దాత, ప్రధాన కారకుడు కొత్త సుబ్రహ్మణ్యంను కమిటీ సభ్యులు, మాతాజీలు సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు డాక్టరేట్



తెనాలిటౌన్: స్థానిక ఐతానగర్‌కు చెందిన చీకటి వెంకటేశ్వరరావు హార్ట్ డీసీస్ డిటెక్షన్, ప్రిడిక్షన్ విత్ మెషీన్ లెర్నింగ్ అనే అంశం మీద పరిశోధన చేసినందుకు గాను తమిళనాడు గవర్నమెంట్ అన్నామలై యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రస్తుతం కెఎల్ యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ రావడంపై స్నేహితులు డాక్టర్ కృష్ణమోహన్, కోంద్రు కిరణ్‌కుమార్, జి.రవికుమార్, కిషోర్, సోమశేఖర్, శ్రీకాంత్ తదితరులు అభినందనలు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

తెనాలిరూరల్: పుట్టింటి నుంచి అధిక కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన దీపిక పుట్టింటి నుంచి అధిక కట్నం తెమ్మంటూ తనను భర్త వేధిస్తున్నాడని పోలీసులను ఆశ్రయించింది. ఆదివారం త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బాపట్ల: అంగరంగ వైభవంగా వేంకటేశ్వరస్వామి వారి ఉదయాస్తమాన సేవా మహోత్సవ కార్యక్రమం స్థానిక బాపట్ల సాయిరాం గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. వేంకటేశ్వరస్వామి వారి ఉదయాస్తమాన సేవా మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామి నేతృత్వంలో కనులు పండువగా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామి మాట్లాడుతూ తిరుమలలో శ్రీవారికి సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు ఏ విధంగా జరుగుతుందో అదే విధంగా బాపట్లలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకుడు కొత్తమాసు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని సకాలంలో పంటలు బాగా పండాలని స్వామి వారికి ఇలాంటి సేవలు చేయటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం స్టేట్ ప్రెసిడెంట్ చిన్ని రామ సత్యనారాయణ, జిల్లా ప్రెసిడెంట్ తూనుగుంట్ల శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ సంజీవరావు, ఉపాధ్యక్షులు ఉప్పాల సుధాకర్, కోళ్లపూడి శివన్నారాయణ, సభ్యులు పోరేపల్లి వెంకట సురేష్, నాలం వేణుగోపాలరావు, తుళ్లూరు రాము, మామిడి రమేష్, కేవీఎస్ ప్రసాద్, శివకుమార్, పొన్నూరు శ్రీనివాసరావు, తుళ్లూరు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



పూజల్లో పాల్గొన్న ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు

కనగాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

చెరుకుపల్లి: మానవుని శరీర భాగాల్లో కళ్లు ఎంతో సున్నితమైనవని వాటి పట్ల ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని హాజీ మహ్మద్ ఖాసిమ్ సాహెబ్ అండ్ మహ్మద్ గాలా సాహెబ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ సమ్మద్ అన్నారు. గుంటూరు పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సమ్మద్ ఆయన తల్లి దోహాజాన్ వారి కళాశాల ప్రాంగణంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సమ్మద్ మాట్లాడుతూ తమ ఎడ్యుకేషన్ సొసైటీ తరఫున 2004 నుంచి ఏటా కనగాల పరిసర ప్రాంత ప్రజలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి వైద్య పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆదివారం నిర్వహించిన 25వ కంటి వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున జిల్లా నలుమూలల నుంచి వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవటం సంతోషం కలిగించిందన్నారు. రానున్న రోజుల్లో భారీ మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు హాజీ మహ్మద్ ఖాసిమ్ సాహెబ్ అండ్ మహ్మద్ గాలా సాహెబ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా సేవలు అందించటం జరుగుతుందని తెలిపారు. ఈ నేత్ర వైద్య శిబిరానికి 260 మంది హాజరు కాగా, 187 మంది కంటి శుక్లాల ఆపరేషన్‌కు ఎంపికయ్యారన్నారు. వారికి పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వారు ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ ఫారూక్, శంకర కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ నలీమ్ చిన్మయ్

ఘనంగా గుడారంకమ్మ కొలుపులు

పాతనందాయపాలెం(కర్లపాలెం): చీరాల వారి ఇలవేల్పు గుడారంకమ్మ అమ్మవారి కొలుపులు ఘనంగా జరిగాయి. పాత నందాయపాలెం గ్రామంలో వేంచేసియున్న చీరాల వంశస్తుల ఇలవేల్పు గుడారంకమ్మ వార్షిక కొలుపులు ఈ నెల 11వ తేదీ నుంచి ఆదివారం వరకు వైభవంగా నిర్వహించారు. కొలుపులలో మొదటి రోజు అమ్మవారి పావడి, వీరతాళ్ళు, వీర కత్తులు ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఉంచి చీరాల వంశస్తులు పలు ట్రాక్టర్‌లలో అధిక సంఖ్యలో బాపట్ల సూర్యలంక సముద్ర తీరానికి వెళ్లి పుణ్య స్నానాలాచరించి తిరిగి అమ్మవారి పావడి గ్రామంలోకి తీసుకుని వచ్చి ఐదు రోజులుగా రాత్రి, పగలు కొత్త నందాయపాలెం, పాత నందాయపాలెం, ఏట్రవారిపాలెం గ్రామాలలో కనక తప్పెట్లు, మంగళ వాయిద్యాలతో కొలుపులు నిర్వహించారు. పాత నందాయపాలెం గ్రామంలోని అమ్మవారి ఆలయం వద్ద గుడారంకమ్మ జీవిత చరిత్రను బుర్ర కథ ద్వారా వినిపించారు. మొక్కులు ఉన్న యువకులు బాలవేషం ధరించి గారెలు, నిమ్మకాయల దండలు వేసుకుని కొలుపులలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆదివారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించటంతో కొలుపులు ముగిశాయి.



ప్రత్యేక అలంకరణలో ఉన్న గుడారంకమ్మ

వృద్ధుల హక్కులపై అవగాహన అవసరం

తెనాలిరూరల్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.వివేక్ వర్ధన్ పాల్గొని వృద్ధులకు ఉన్న హక్కులను, చట్టాలలో వారికి కల్పించిన వెసులుబాటును, చట్టబద్ధంగా వాటి ఉపయోగించే విధానం పై అవగాహన కల్పించారు. సమాజంలో వారు నిరాధరణకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ వృద్ధులు నిరాధరణకు గురవుతున్న అంశాలను వివరించారు. వారికి చేయూత అందించటమే ఈ న్యాయ విజ్ఞాన సదస్సు ఉద్దేశమని చెప్పారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ సమాజంలో వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారని, దానికి మానవీయ విలువలు లోపించడం ప్రధాన కారణమన్నారు. వాటిని పెంపొందించడం కోసం స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ సహాధ్యక్షుడు జి.సుబ్బారావు మాట్లాడుతూ వృద్ధులకు తమ అసోసియేషన్ అండగా ఉంటుందని తెలిపారు. స్వరలయ వేదిక అధ్యక్షుడు లక్కరాజు సాయి, న్యాయ సేవా అధికార సంస్థ సూపరింటెండెంట్ మహబూబ్, పెన్షనర్ల సంస్థ కార్యదర్శి సూర్యప్రకాశరావు, సోమయ్య శాస్త్రి పాల్గొన్నారు.

తెలుగు ఆధునిక అభ్యుదయ సాహిత్యంలో శ్రీశ్రీ సరికొత్త ప్రభంజనం

బాపట్ల: తెలుగు ఆధునిక అభ్యుదయ సాహిత్యంలో శ్రీశ్రీ సరికొత్త ప్రభంజనాన్ని సృష్టించారని ప్రజా కవి డాక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. బాపట్ల జమేదారు పేటలోని సాహితీ భారతి కార్యాలయంలో ఆదివారం జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభకు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాప్రస్థానం, ఖడ్గసృష్టి వంటి కవితా సంపుటాలు నేటికీ తెలుగు కవులలో నూతన స్ఫూర్తిని నింపుతున్నాయన్నారు. సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ శ్రీ శ్రీ 'కదిలేది కదిలించేది పెను నిద్దుర వదిలించేది పరిపూర్ణ బతుకిచ్చేది కావాలోయ్ నవ కవనానికి ' అని ఆధునిక కవిత్వానికి సరికొత్త నిర్వచనం ఇచ్చారన్నారు. సాహితీ భారతి ఉపాధ్యక్షుడు ఎం.మాల్యాద్రి రావు మాట్లాడుతూ శ్రీశ్రీ తన కవిత్వంలో కార్మిక కర్షక జీవితాల కష్టాలు కన్నీళ్లను ఆవిష్కరించారన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ శ్రీ శ్రీ దాదాపు 280 చిత్రాలకు వేయికి పైగా పాటలు రచించారన్నారు. ఈ సభలో ఎం.జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, దగ్గు మల్లి శామ్యూల్, బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి, కాళిదాసు తదితరులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



తెనాలిటౌన్: వాకర్స్ క్లబ్ తెనాలి–2 ఇరవై సంవత్సరాలు పూర్తి చేసుకున్నట్లు క్లబ్ అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ళ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం వాకర్స్ క్లబ్ తెనాలి–2లో నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితాన్ని నడక ఎంతో అవసరమన్నారు. క్లబ్ 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అహ్మదాబాద్ విమాన దుర్ఘటన మృతులకు నివాళులర్పించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు టి.రాజారావు కుటుంబ సభ్యులు పేద విద్యార్థికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. జి.విజయసాగర్, డాక్టర్ పి.దీప్తి, జి.మురహరిరావు, భుజంగరావు, సత్యనారాయణరాజు, దేవబత్తుని ఉమామహేశ్వరరావు, తుమ్మల సత్యనారాయణ, విజయ, అనురాధ, జ్యోతి, శ్రీలత, ఝాన్సీలక్ష్మి, జి.ఎల్.ప్రసన్నకుమారి, తదితరులు ఉన్నారు.